بسم اللہ الرحمٰن الرحیم نحمدہٗ ونصلی علٰی رسولہ الکریم وعلٰی عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 22.02.2019 (Telugu)**

## ఇదొక భవిష్యవాణి మాత్రమే కాదు, ఒక ఆకాశ సంకేతము, కనికరము గల, కరుణామయుడు, దయాసాగరుడైన మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, వైభవమును బహిర్గతపరచుటకు అల్లాహ్ తఆలా చూపెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 22.02.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి. ఇప్పుడు జమాఅత్‌లలో ముస్లిహ్ మౌవూద్ రోజును పురస్కరించుకొని అనగా ఈ భవిష్యవాణి గురించి సభలు నిర్వహించబడుచున్నవి. ఈ భవిష్యవాణిలో అల్లాహ్ తఆలా ఒక వాగ్దత్త కుమారుని పుట్టుక గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు వార్త అందించెను. ఆ కుమారునికి ప్రత్యేక విశిష్టతలు ప్రసాదించబడునని అల్లాహ్ తఆలా సూచించెను. అతడు ధార్మిక సేవకుడగును. సుదీర్ఘ ఆయువు పొందును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉద్దేశమును పూర్తి చేయును. 20 ఫిబ్రవరి 1886 తేదీన ఈ భవిష్యవాణి చేయబడెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు అల్లాహ్ తఆలా సహకరించినట్లు వారి సత్యమునకు ఈ భవిష్యవాణి ఒక గొప్ప సాక్ష్యము. ఆ బాలుని పుట్టుకకు నిర్ణయించిన కాలములోనే 12 జనవరి 1889 తేదీన ఆ బాలుడు జన్మించెను. ఆ బాలుని పేరు మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ అని పెట్టబడెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ పరమపదించిన తర్వాత అల్లాహ్ తఆలా వీరిని ఖలీఫాగా నియమించెను. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదొక కుమారుని భవిష్యవాణి మాత్రమే కాదు. ఒక అద్భుత ఆధ్యాత్మిక విప్లవమునకు నాంది పలుకబోవుచున్న గొప్ప కుమారుని పుట్టుక గురించి ఈ భవిష్యవాణి చేయబడెను. ఈ విషయము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. ఇదొక భవిష్యవాణి మాత్రమే కాదు, ఒక ఆకాశ సంకేతము, కనికరము గల, కరుణామయుడు, దయాసాగరుడైన మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, వైభవమును బహిర్గతపరచుటకు అల్లాహ్ తఆలా చూపెను. ఒక శవమును బ్రతికించడం కంటే వంద శాతం ఇది గొప్ప, ఉన్నత, పరిపూర్ణ, అద్భుత, సంపూర్ణమైనది. ఎందుకనగా శవమును బ్రతికించు వాస్తవమేమనగా అల్లాహ్ తఆలా ఆస్థానములో దుఆ చేసి ఒక ఆత్మను తిరిగి రప్పించుటయే అగును. కాని ఈ విషయములో అల్లాహ్ తఆలా కృపానుసారము, హజ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం శుభముతో దయామయుడు, పరమకారుణ్యమూర్తి అయిన అల్లాహ్ తఆలా ఒక శుభకరమైన ఆత్మ నాకు ప్రసాదించునని వాగ్దానము చేసెను. తద్వారా ఆ ఆత్మ బాహ్యాంతర శుభములు ప్రపంచమంతటా వ్యాపించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఏదో ఒక సాధారణ ఆత్మను అడగలేదు. ఒక సంకేతము అడిగినందున అందుకు సమాధానంగా అనేక విశిష్టతలు గల కుమారుని పుట్టుక గురించి అల్లాహ్ తఆలా వార్తనందించెను. సుదీర్ఘ ఆయువు పొందు, అతి వివేకము, తెలివి గల, అద్భుత వైభవము, గొప్ప స్థాయి, అంతస్థులు పొందు మహా గొప్ప కుమారుని గురించి వార్త అందించబడెను. జాతులు అతనిచే శుభములు పొందును. అతడు బాహ్యాంతర విద్యలతో పూరించబడును. దైవ శాసనము అనగా పవిత్ర ఖుర్ఆన్ గొప్ప, లోతైన జ్ఞానము అతనికి ప్రసాదించబడును. ఈ దైవ ప్రసాదిత జ్ఞానము వలన అతడు పవిత్ర ఖుర్ఆన్‌నకు గొప్ప సేవలందించు అనుగ్రహము పొందును. తద్వారా దైవ శాసన స్థాయి ప్రపంచమునకు తెలిసిపోవును. అతడు ఖైదీలకు ఊరట కల్పించును. అప్పుడు ప్రపంచములో విధ్వంసమేర్పడును. అనగా అతని జీవితములో ప్రపంచ యుద్ధములు సంభవించును. అవి ప్రపంచమును దహనం చేయును. అతడు భూమి అంచుల వరకు ఖ్యాతి గడించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వారి విద్యాభ్యాసము గురించి మాట్లాడుకున్నచో పవిత్ర ఖుర్ఆన్ చూచి చదివిన తర్వాత పాఠశాలలో చేరి సంప్రదాయ విద్యాభ్యాసము చేయు అవకాశము లభించెను. ఇంటి వద్ద కూడ ఉపాధ్యాయులచే ఉర్దు, ఆంగ్లము గురించి ప్రాథమిక విద్యనభ్యసించిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు స్వయంగా

ఇట్లు తెలిపిరి. నా విద్యాభ్యాసము గురించి హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్‌హు గారు అందరికంటే ఎక్కువ ఉపకారము చేసిరి. వారు వైద్యులైనందున నేను పుస్తకమును ఎక్కువ సమయం చూడలేనని వారికి తెలిసియుండెను. కావున వారు అవలంభించిన పద్ధతి ఏమనగా నన్ను వారు తమ వద్ద కూర్చోబెట్టుకొని నేను చదువుతాను నీవు వినమని నాతో అనేవారు. దీనికి కారణమేమనగా బాల్యములో నా కనులలో గడ్డలైనవి. వరుసగా 3,4 సంవత్సరములు నా కనులు మండుచుండేవి. ఈ గడ్డల వలన నా చూపు శాశ్వతంగా పోవునని వైద్యులు చెప్పిరి. ఈ వ్యాధి ముదిరినందున, వరుసగా ఈ వ్యాధి తిరగబడినందున నా ఒక కన్ను చూపు పూర్తిగా తగ్గిపోయినది. ఇందువల్లనే నా ఎడమ కన్నులో చూపు లేదు. నేను దారి చూడగలను కాని పుస్తకము చదవలేను. ఇతను కోరిన విధంగా విద్యాభ్యాసము జరుగునని నా ఉపాధ్యాయులతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చెప్పియుండిరి. ఇతను కోరినంత చదువుకొనును. చదవనిచో ఇతన్ని బలవంతం చేయరాదు. ఇతని ఆరోగ్యము విద్యాభ్యాస భారమును మోయుటకు అనుగుణంగా లేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పదే పదే నాతో ఇట్లనేవారు. నువ్వు పవిత్ర ఖుర్‌ఆన్ అనువాదము, బుఖారి హజ్రత్ మౌల్వీ గారితో చదువుకొనుము. వైద్యము మన వంశ వృత్తి అయినందున కొంచెం వైద్యము కూడ చదువుకో అని వారు నాకు చెప్పియుండిరి.

వారిట్లనిరి. మాస్టర్ ఫఖీరుల్లాహ్ గారు మాకు గణితము బోధించేవారు. వారొకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సం వద్దకు వచ్చి హుజూర్! ఇతడు బొత్తిగా చదవడం లేదు, పాఠశాలకు వరుసగా రావడం లేదని నా గురించి ఫిర్యాదు చేసిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి. ఇంకా ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సం వద్దకు మాస్టర్ గారు వచ్చి ఈ ఫిర్యాదు చేసినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సం ఇప్పుడు ఎంత కోపము చేస్తారోనని భయపడి నేను దాక్కొంటిని. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సం ఈ ఫిర్యాదు విని ఇట్లనిరి. మీరు బాలుని బాగోగులు చూస్తున్నందున మీకు కృతజ్ఞతలు. అప్పుడప్పుడు ఇతడు పాఠశాల వస్తున్నాడని విని నాకు ఆనందము కలుగుచున్నది. ఇతడు అప్పుడప్పుడు పాఠశాల రావడం చాలా మంచి విషయము. ఎందుకనగా ఇతని ఆరోగ్యము వలన ఇతను చదువుకొనుటకు అనర్హుడు. అనంతరం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సం చిరునవ్వుతో ఇట్లనిరి. ఇతనిచే కిరాణ దుకాణము తెరిచే ఉద్దేశము లేనందున ఇతనికి గణితము నేర్పించి చేసేదేమిటి? గణితము ఇతనికి వచ్చినా రాకపోయినా ఇబ్బందేమి లేదు. అనంతరం ఇట్లనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం లేదా వారి అనుచరులు ఏ గణితము నేర్చుకున్నారు. ఇతడు పాఠశాలకు వచ్చినచో మంచిది. రానిచో ఇతన్ని బలవంతము చేయరాదు. ఇది విని మాస్టర్ గారు తిరిగి వెళ్లిపోయిరి. ఈ వెసులుబాటుతో నేను మరింత అలసటను ప్రదర్శించినాను. కావున పాఠశాలకు పోవడమే మానేసితిని. నెలకొక్కసారి పోయేవాడిని. ఈ విధంగా నేను చదువుకున్నాను. వాస్తవానికి నా పరిస్థితి మంచిగా లేకుండెను. బాల్యములో కంటి నొప్పితో పాటు కాలేయము కూడ చెడిపోయెను. ఆరు నెలల వరకు వరుసగా నాకు పెసరి పప్పు రసము లేదా ఆకు కూరల రసము త్రాగించేవారు. దీనికి తోడు పిత్తాశయము కూడ పెరిగిపోయెను. నా పిత్తాశయము చోట రెడ్ ఆయుడ్ ఆఫ్ మర్కరితో మర్ధన చేసేవారు. ఇదే విధంగా స్వరంపై కూడ మర్ధన చేసేవారు. ఎందుకనగా నాకు స్వరములో కూడ గడ్డలయ్యేది. సారాంశమేమనగా కనులలో గడ్డలు, కాలేయ వ్యాధితో పాటు జ్వరము ఒకసారి మొదలైనచో ఆరు నెలల వరకు తగ్గేది కాదు. ఇతడు చదువుకున్నంత చదువుకోవడమే మేలు. చదువు గురించి ఇతన్ని బలవంతము చేయరాదని ఉపాధ్యాయులు నిర్ణయించుటను చూచినచో నా విద్య సామర్థ్యత ఏమిటో ప్రతి ఒక్కరు అంచనా వేయవచ్చును.

హజ్రత్ ఖలీఫా అవ్వల్ నాతో సదా ఇట్లనేవారు. నీవు స్వయంగా చదువుకొనుటకు నీ ఆరోగ్యము సహకరించదు. కనుక నువ్వు నావద్దకు వచ్చినచో నేను చదువుతాను నువ్వు వినవచ్చును. వారు చాలా కష్టపడి నాకు మొదట ఖుర్‌ఆన్ చదివించిరి. అనంతరం బుఖారి చదివించిరి. వారు నాకు క్రమంగా ఖుర్‌ఆన్ చదివించలేదు. వారు అవలంభించిన పద్ధతి ఏమనగా వారు ఖుర్‌ఆన్ చదువుచు అనువాదము కూడ చెప్పేవారు. ఏదైనా అనివార్యమైన విషయము యున్నచో వివరించేవారు. లేనిచో త్వర త్వరగా చదువుతూ పోయేవారు. వారు మూడు నెలల్లో ఖుర్‌ఆన్ మొత్తం నాకు చదివించిరి. నేను వారితో వైద్యము కూడ చదువుకున్నాను. వారు నాకు పవిత్ర ఖుర్‌ఆన్ విశ్లేషణ కూడ చదివించిరి. పవిత్ర ఖుర్‌ఆన్ విశ్లేషణ రెండు నెలల్లో నాకు చదివించిరి. వారు నన్ను తన వద్ద కూర్చోబెట్టుకొని ఒకసారి అర్ధ భాగము మరోసారి మొత్తం భాగము అనువాదముతో సహా చదివి వినిపించేవారు. కొన్ని సూక్తుల వివరణ కూడ ఇచ్చేవారు. ఇదేవిధంగా బుఖారి రెండు, మూడు నెలల్లో ముగించిరి. వారొకసారి రమజాన్ నెలలో

పూర్తి ఖుర్ఆన్ పాఠము చెప్పిరి. నేను అందులో కూడ పాల్గొన్నాను. కొన్ని అరబ్బి పత్రికలు కూడ నేను వారితో చదువుకున్నాను. ఈ విధంగా నా విద్యాభ్యాసము కొనసాగెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా వారికి చదివించినట్లు వారి ఉపన్యాసములు, వారి ప్రసంగములు, వారి రచనలు, వారు చేసిన పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణలు సాక్ష్యముగా యున్నవి. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములో 1906 సంIIలో జరిగిన జల్సా సాలానాలో వారు మొదటి సారి ప్రజల సమక్షములో ఉపన్యాము చేసిరి. హ్రజత్ ఖాజి ముహమ్మద్ జహూరుద్దీన్ అక్మల్ గారిట్లు తెలిపిరి. ప్రవక్తృత్వ బురుజుపై గల ప్రకాశవంతమైన నక్షత్రము, సందేశహరునిచే వెలువడిన గొప్ప వజ్రము మహ్మూద్ సల్లమహుల్లాహ్ గారు అన్యారాధన అనే అంశముపై ప్రసంగించుటకు నిలిచినప్పుడు ఎంత సాహిత్యము ప్రవహించుచుండెనో ఏమి చెప్పగలను. ఇంత చిన్న వయసులో ఇంత పరిపక్వత చెందిన ఆలోచనలు నిజంగా మహిమ కంటే తక్కువేమి కాదు. నా దృష్టిలో ఇది కూడ హుజూర్ అలైహిస్సలాం సత్యమునకు ఒక నిదర్శనము. మసీహ్ అలైహిస్సలాంచే చక్కదిద్దబడిన వజ్రము గొప్ప స్థాయికి చేరినది. ఆధ్యాత్మిక విశిష్టతల గురించి వారు ఎంతో అద్భుతంగా ప్రసంగించారు.

ఈ కాలములో వారు చేసిన ధార్మిక సేవలు, వారి ఉత్సాహము, వివేకము, ఆధ్యాత్మిక పెరుగుదలను చూచి "అతడు వేగంగా పెరుగును" అను భవిష్యవాణి పదాలు వారి పట్ల పూర్తి అగుచున్నట్లు కనిపించుచుండెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ ఇదే ధార్మిక ఉత్సాహమును చూచిరి. వారిట్లనిరి. మహ్మూద్‌లో కనిపించుచున్న ధార్మిక ఉత్సాహము వలన అతని కొరకు కొన్ని సార్లు నేను దుఆ చేస్తాను. హ్రజత్ ఖలీఫతుల్ మసీహ్రాబె రచించిన జీవిత చరిత్రలో ఒక చోట వారిట్లు వ్రాసిరి. ప్రథమ ఖిలాఫత్ ఆరంభములో హ్రజత్ మిర్జా బషీరుద్దీన్ గారి వయసు 19 సంIIలుండెను. హ్రజత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్హు పరమపదించినప్పుడు వారు తమ 26వ సంIIలో అడుగుపెట్టిరి. ఈ నవయువకునిగా వారి ప్రసంగము, రచనలోని కొన్ని ఉదాహరణలు ప్రవేశపెట్టెదను. వారి ఆలోచనలు, భావాలలో ఒక గొప్ప ఆలోచనాకర్తకు వుండాల్సిన పరిపక్వత వచ్చెను. వారి పదాలు విచిత్రమైన ప్రభావము, వినమ్రత, తియ్యదనము కలిగి వుండేవి. మాటలలో కృత్రిమము కనిపించేదికాదు. రచనలు కూడ అనవసర విషయాలతో పవిత్రముగా యుండేది. ఉపన్యాసము సహజ పద్ధతిలో కొనసాగేది. రచనలో సాహిత్యము ఉప్పొంగేది. ఈ రెండు పవిత్ర ఖుర్ఆన్ విజ్ఞాన, జ్ఞాన నీటితో నిండి మనసు, మెదడును పదును చేసేది. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పరమపదించిన తర్వాత 19 సంIIల వయసులోనే వారు చేసిన మొదటి ఉపన్యాసము గురించి హ్రజత్ మౌల్వీ షేర్ అలి రజియల్లాహు తఆలా ఇట్లనిరి. ఈ వ్యాసములో నేనొక సంఘటన హ్రజత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్హు మొదటి ప్రసంగము గురించి చెప్పదలచితిని. వారు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పరమపదించిన తర్వాత మొదటి జల్సా సాలానాలో చేసిరి. ఈ జల్సా మదర్సా అహ్మదియ్యా ప్రాంగణములో నిర్వహించబడెను. వేదికపై హుజూర్‌కు కుడి వైపున హ్రజత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్హు ఆసీనులైయుండిరి. ప్రస్తావించదగ్గ రెండు విషయములు ఈ ఉపన్యాసము గురించి గలవు. మొదటి విషయమేమనగా అప్పుడు వారి ధ్వని, వారి పద్ధతి, వారి స్వరము, వారి ఉపన్యాస విధానము పూర్తిగా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ధ్వని, ఉపన్యాస పద్ధతితో ఎంతగా పోలియుండెననగా కొద్ది కాలము క్రితమే మాతో దూరమైన హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జ్ఞాపకమొచ్చిరి. గ్రామోఫోన్ ద్వారా దూరమున్న వ్యక్తి పిలుపు వినిపించినట్లే హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ధ్వని వాగ్దత్త కుమారుని పెదవులచే వినిపించుచున్నందున అక్కడున్న సభికులందరు కంటతడి పెట్టిరి. కంటతడిపెట్టిన వారిలో నేను కూడ యుంటిని. రెండవ విషయమేమనగా జీవితాంతం పవిత్ర ఖుర్ఆన్ గురించి గ్రహించిన, పవిత్ర ఖుర్ఆన్ తమ ఆత్మ ఆహారమైన వ్యక్తి అనగా హ్రజత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ ఉపన్యాసము ముగిసిన తర్వాత ఇట్లనిరి. మియా గారు వెలువడించిన విశ్లేషణ నా కొరకు కూడ క్రొత్తగా యుండెను. ఈ విజ్ఞానము ఈ నవయువకునికి ఎవరు నేర్పించినారు. హ్రజత్ యూసుఫ్ అలైహిస్సలాం గురించి وَلَمَّا بَلَغَ أَشُدَّهُ آتَيْنَاهُ حُكْمًا وَعِلْمًا ۚ وَكَذَٰلِكَ نَجْزِي الْمُحْسِنِينَ (యూసుఫ్:23) అనగా "అతడు యుక్త వయస్సునకు చేరినప్పుడు మేమతనికి వివేకము, జ్ఞానము ప్రసాదించితిమి. మేలు చేయువారికి మేము ఈ విధముగనే ప్రతిఫలము నొసంగెదము" అని చెప్పిన అల్లాహ్‌యే నేర్పించెను. వారు సాధారణ వివేకము, విజ్ఞాన విషయములు మాత్రమే చెప్పలేదు. పవిత్ర ఖుర్ఆన్ వభిన్న విజ్ఞానములు వారు వెల్లడించిరి. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లనెను. لَا يَمَسُّهُ إِلَّا الْمُطَهَّرُونَ అనగా పవిత్రులు తప్ప దానిని ఎవరు ముట్టుకోలేరు. బాల్యపు దశ దాటగానే పవిత్ర ఖుర్ఆన్ నూతన, మహిమాన్విత విజ్ఞానములను ప్రజల ముందు చెప్పడం మొదలు పెట్టిరి. బాల్యమును కూడ అల్లాహ్ తఆలా ప్రత్యేక శిక్షణలో వారు గడిపినారని, బాల్యము నుండే వారు పవిత్రులలో చేరిరనుటకు ఇదొక స్పష్టమైన సాక్ష్యము.

బాల్యములో వారి ప్రార్థన ప్రామాణికము ఎట్లుండెను. దీని గురించి షేఖ్ గులాం అహ్మద్ వాయిజ్ గారు రజియల్లాహు అన్‌హు ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. నేటి రాత్రి నేను మస్జిద్ ముబారక్‌లో గడపాలని, తద్వారా ఒంటరిగా నా యజమానితో తోచినది యాచించుతానని నిర్ణయించుకొని మస్జిద్‌లో ప్రవేశించగా సాష్టాంగములో వున్నట్లు ఒక వ్యక్తిని చూచతిని. అతడు అతి దుఃఖముతో దుఆ చేయుచుండెను. ఈ దుఃఖము వలన నేను నమాజ్ చదవలేక పోతిని. ఆ వ్యక్తి దుఆ నాపై కూడ ప్రభావము చూపుచుండెను. కావున ఓ అల్లాహ్! ఈ వ్యక్తి అడుగుచున్నది ఇతనికి ఇచ్చివేయమని నేను దుఆ చేసితిని. తల లైకి లేపినచో ఎవరో చూడాలని నేను నిలబడి అలసిపోతిని. వారు తల పైకి లేపగా వారు హజ్రత్ మియాఁ మహ్‌మూద్ అని నేను చూచితిని. నేను అస్సలాము అలైకుమ్ అని చెప్పి అల్లాహ్ తఆలాతో ఏమి అడిగినారని ప్రశ్నించితిని. వారిట్లనిరి. నా కనుల ముందు ఇస్లాంను ప్రబతికించి నాకు చూపమని నేనడిగితిని. ఇలా చెప్పి వారు లోనికి వెళ్లిపోయిరి. ఈ చిన్న వయసులోనే ఇస్లాం విజయ దినమును చూచుటకు వారి హృదయములో ఇంత వ్యాకులత యుండెను. కావున అల్లాహ్ తఆలా వారికి యవ్వనములోనే ఖిలాఫత్ అప్పగించెను.

హజ్రత్ కలీఫతుల్ మసీహిస్సాని రజి. తష్‌హీజుల్ అజ్‌హాన్‌లో తమ ఒక దుఆను వ్రాసిరి. దీనిని వారు 1909 సం॥లో వ్రాసిరి. వారు అల్లాహ్ తఆలా ఆస్థానములో దుఆ చేయుచు ఇట్లు వేడుకొనిరి.

ఓ నా అల్లాహ్! నేను అతి వినయముతో, బాధాతప్త హృదయముతో, నిజమైన వ్యాకులతతో నీ ఆస్థానములో సాష్టాంగము అగుచు ఇట్లు వేడుకొంటున్నాను. నా దుఆను విని నా కోరికను పూర్తి చేయుము. ఓ నా పవిత్రమైన అల్లాహ్! నా జాతి నాశనమగుచున్నది. దీనిని రక్షించుము. తమ హృదయములను, మనసులను పవిత్రముగా చేసుకోక, నీ ప్రేమలో లీనము కాని వారు అహ్మదీయులనబడినను వారితో నాకేమి సంబంధము. కావున ఓ నా పోషకుడా! తమ గుణములు దయామయుడు, పరమకారుణ్యమూర్తిని ఉద్రేకింపజేసి వారిని పవిత్రులగా చేయుము. అనుచరుల ఉత్సాహము, ఉద్రేకము వారిలో పుట్టించుము. వారు నీ ధర్మము కొరకు కలత చెందేటట్లు చేయుము. వారి కర్మలు వారి మాటల కంటే ఎక్కువ గొప్పగా, పవిత్రముగా కావలెను. వారు నీ ప్రియమైన ముఖము కొరకు త్యాగములు సమర్పింతురు గాక! నబీ కరీం కొరకు త్యాగమగుదురు గాక! నీ మసీహ్ దుఆలు వారి పక్షమున పూర్తి అగుగాక! వారి పవిత్రమైన, స్వచ్ఛమైన బోధన వారి హృదయములో నాటుకుపోవును గాక! ఓ నా అల్లాహ్! వారిని అన్ని రకాల బాధలు, ఇబ్బందుల నుండి రక్షించుము. విభిన్న రకాల ఆపదల నుండి వారిని రక్షించుము. వారిలో గొప్ప గొప్ప సత్యవంతులను పుట్టించుము. నీవు ఇష్టపడిన జాతిగా వారు మారుదురు గాక! నీవు తన కొరకు ప్రత్యేకించుకున్న జాతిగా వీరు సిద్ధమగుదురు గాక! షైతాన్ పట్టు నుండి వీరు దూరముందురు గాక! వారిపై సదా దేవదూతలు అవతరించుదురుగాక! ఈ జాతిని ధర్మము, ప్రపంచములో శుభమునకు సూచికకగా మార్చుము. ఆమీన్ సుమ్మ ఆమీన్ యా రబ్బుల్ ఆలమీన్.

చివరగా హుజూరె అన్వర్ ఇట్లు దుఆ చేసిరి. అల్లాహ్ తఆలా వారిపై వేలాది కరుణలు కురిపించుగాక! వారు చేసిన ఈ దుఆను అర్థము చేసుకొని, దుఆ చేయు, అహ్మది అయిన ఉద్దేశమును పూర్తి చేయుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! ☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.................................................................

.................................................................

.................................................................